క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.వి జయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్‌ఐ ప్రమీల, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం



రహదారి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25 వార్డులో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపల్లి గోవింద్ పర్యవేక్షణలో సీతంపేటలోని కనకమ్మ వారి వీధిలో నూతన తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆయన రహదారి నిర్మాణ నాణ్యతను ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, రవి, వార్డు ఎమినిటీ సెక్రటరీలు మదీన, అనూష పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



మాట్లాడుతున్న ఆచార్య పాండురంగ విఠల్‌మూర్తి

సీతంపేట: విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో అడవి బాపిరాజు 128వ జయంతి సభ నిర్వహించారు. ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి మాట్లాడుతూ బాపిరాజు రచనలపై తన అభిరుచిని, అధ్యయనాన్ని వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ బాపిరాజు జీవిత విశేషాలను వివరిస్తూ, కథకుడిగా, నవలా రచయితగా, కళా దర్శకుడిగా బాపిరాజు బహుముఖ ప్రతిభను విశ్లేషించారు. జాతీయవాదిగా ఆయన స్థానం మహోన్నతమన్నారు.

దేవీ శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గ అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, దేవస్థానం సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల కట్టడిపై ఫోకస్

- ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- ఎప్పటికప్పుడు భద్రత, అవగాహన కార్యక్రమాలు
- బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ



దుర్గానగర్ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లు



కంచరపాలెం మెట్టు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు



తాటిచెట్లపాలెం జంక్షన్‌లో టూ వీలర్ కీప్‌లెఫ్ట్ యారో మార్క్‌ను పెయింట్‌చేస్తున్న సిబ్బంది

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. రహదారుల్లో భద్రతా చర్యలు, ప్రజలకు, వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాల వంటివి విస్తృతంగా చేపడుతున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది కొంతమేర రోడ్డు ప్రమాదాలు తగ్గాయనే చెప్పుకోవచ్చు. 2021లో 144 ప్రమాదాలు సంభవించగా.. 20 మంది మరణించారు. 2022లో 121 ప్రమాదాలు జరగ్గా.. 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఆగస్ట్ వరకు 76 రోడ్డు ప్రమాదాలు సంభవించగా.. అందులో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు గత నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 185 కేసులు నమోదు చేశారు. అందులో 51 కేసులకు గానూ రూ.3.51 లక్షల జరిమానాలు వేసి, 8 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క సెప్టెంబర్‌లోనే మైనర్ డ్రైవింగ్ కేసులు 10, ఓవర్‌స్పీడ్ డ్రైవింగ్‌కు గానూ 512 కేసులు నమోదు చేశారు.

ప్రధాన జంక్షన్లలో ప్రత్యేక నిఘా

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు మెరుగైన ట్రాఫిక్ ఉండేలా చర్యలు చేపట్టాలని, హెవీ ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలైన తాటిచెట్లపాలెం జంక్షన్, కప్పరాడ జంక్షన్, బర్మా జంక్షన్, బిర్లా జంక్షన్, ఆర్ అండ్ బీ జంక్షన్లను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. నిత్యం ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు.

ఇవీ చర్యలు

- తాటిచెట్లపాలెం జంక్షన్‌లో చిన్న వాహనాలు ఎడమ వైపు వెళ్లేలా కీప్‌లెఫ్ట్ యారో మార్క్‌ను పెయింటింగ్ చేశారు.
- వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జాతీయ రహదారిపై ఇంటర్‌సెప్టార్ వాహనాలను అందుబాటులో ఉంచారు. వాటి ద్వారా వాహన చోదకులు ఎంత వేగంతో వాహనాలు నడుపుతున్నారో గుర్తించి, స్పీడ్‌కు కళ్లెం వేసేలా తగు చర్యలు తీసుకుంటున్నారు.
- ఇటు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎక్కడికక్కడ వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, సిమెంట్ బ్లాక్స్ ఏర్పాటు చేశారు.
- బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో కేవలం బస్సులు ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపే వారితో ట్రాఫిక్ రూల్స్ ముద్రించిన ప్లకార్డులు ప్రదర్శింప జేస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- నిబంధనలు అతిక్రమించి, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇటువంటి చర్యల ద్వారా రోడ్డు ప్రమాదాల కట్టడికి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారు. వాహన చోదకులు కూడా ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాహనానికి సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలని వాహనదారులకు సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం



పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా అనేక చర్యలు చేపడుతున్నాం. ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ జి.రాజీవ్‌కుమార్‌లు సైతం దగ్గరుండి చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. వాహన చోదకులకు స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. ప్రజలెవరూ ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రాత్రి, పగలు తగు చర్యలు తీసుకుంటున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

విజయవాడకు వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' నేతలు



జెండా ఊపి జర్నీని ప్రారంభిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: విజయవాడలో సోమవారం జరగనున్న వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సమావేశానికి పార్టీ ఉత్తర నియోజకవర్గ నేతలు తరలివెళ్లారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం నుంచి నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 15 కార్లలో కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు బయలుదేరారు. కె.కె.రాజు జెండా ఊపి జర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

పేదలకు అందుబాటులో విద్య ఉండాలి



మాట్లాడుతున్న జె.బి.రాజు

సీతంపేట: పేదలు ఎదగాలంటే విద్యే మూలమని, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విద్యా రంగ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నాశనం చేసే 117 జీవోను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో స్కూళ్లు మూసివేయడం విరమించుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. పేదలకు విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎల్.వి.ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.జార్జి, మట్టపర్తి సత్యనారాయణ, తుమ్మిడి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో కంపా హనోకు జన్మదిన వేడుకలు



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు దంపతులు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు జన్మదిన వేడుకలు ఆదివారం జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం అందజేశారు. ముందుగా కంపా హనోకు సతీ సమేతంగా వృద్ధులతో కలసి కేక్ కట్‌చేశారు. ఆయన కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, నాని, నాయుడు, దుర్గేష్, సన్ని, గణపతి, శ్యామ్, సురేష్, యోగి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో..

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కంపా హనోకు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి శాలువాతో హనోకును సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త, గాన విద్వాంసుడు భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మి నగేష్ తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో దేవస్థానంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారోత్సవాల్లో కార్యక్రమాలివి..

ధర్మప్రచార వారోత్సవాలు ఈ నెల 14 వరకు నిర్వహించనున్నారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మం మరింత వ్యాప్తి చెందేందుకు దేవదాయ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 9న హరికథ, 10న భక్తి సంగీతం, 11న కూచిపూడి నృత్యాలు, 12న భజనలు, 13న కోలాటాలు, 14న పారాయణ నిర్వహించనున్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు మురళీనగర్ కోలాట బృందం



టీటీడీ బ్రహ్మోత్సవాలకు ఎంపికైన కోలాట బృందం సభ్యులు

మురళీనగర్: తిరుమల తరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శనకు మురళీనగర్ మహిళా కోలాట బృందం ఎంపికైంది. ఈ బృందంలోని 23 మంది సభ్యులు కోలాటం శిక్షకురాలు రూపా ఆధ్వర్యంలో తమ కళారూపాలను ప్రదర్శిస్తారు. ఈ మేరకు బృంద సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. దేవదేవుడి సమక్షంలో తమకు కోలాటం ప్రదర్శించే అవకాశం రావడం తమ పూర్వ జన్మసుకృతమని ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేశారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వెండి నాణేలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్



కార్యక్రమంలో పాల్గొన్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కంచికామకోటి పీఠం తరపున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గాన ఝరి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకర మఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరపున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాశీప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

చిట్టిబాబు కాలనీలో దంత వైద్య శిబిరం



దంత వైద్య శిబిరంలో వైద్యులు, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి చిట్టిబాబు కాలనీలోని మెహెర్ బాబా ధ్యాన మందిరంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ హాస్పిటల్ వైద్యులు పలు దంత వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దంత సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. మహిళా వాకర్స్ క్లబ్ తరపున టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు, నోటి దుర్వాసన పోగొట్టే రెక్సిడిన్ లిక్విడ్‌ను అందజేశారు. కార్యక్రమంలో వీ డెంటల్ వైద్యులు డాక్టర్ కె.రష్మిక, డాక్టర్ రమేష్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శేషమణి, కార్యదర్శి సనపల పుష్పలత, కోశాధికారి సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షురాలు లీలానాయుడు, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, క్లబ్ సభ్యులు ఎస్.నాగేశ్వరి, ప్రకాష్, మెహెర్ బాబా ధ్యాన మందిరం నిర్వాహకులు శ్యామల, సత్యనారాయణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి



వీఎస్ కృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండదండలు



మాట్లాడుతున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

సీతమ్మధార: ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డైమండ్ పార్క్ వద్ద నిరాశ్రయులకు అండగా 'మేమున్నాం' అనే కార్యక్రమం నిర్వహించారు. డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫర్ యోగా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. దాతలు సమకూర్చిన భోజనాన్ని వసతి గృహంలో ఉంటున్న వారికి అందజేస్తూ, రోడ్డుపై ఉంటున్న అభాగ్యులను షెల్టర్‌కు పంపిస్తున్నామన్నారు. తెన్నేటి లాఫర్ యోగా క్లబ్ ప్రతినిధి ఐ.టి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ షెల్టర్లకు కావల్సిన దుస్తులు, భోజనం అందిస్తూ తమ వంతు సహకరిస్తున్నామన్నారు. రెండు క్లబ్‌ల తరపున 80 మంది సభ్యులు నిరాశ్రయులకు అండగా ఉంటామని ప్రకటించారు. డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు పట్నాయక్, సెక్రటరీ కుమార్, సభ్యులు టి.ప్రసాద్, పి.జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌ఎస్ వాగిర్ సిబ్బందికి అభినందన



ఆస్ట్రేలియా సందర్శనను పూర్తి చేసుకున్న ఐఎన్‌ఎస్ వాగిర్ సిబ్బంది



సిబ్బందిని అభినందిస్తున్న ఈఎన్‌సీ సబ్ మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్

సింధియా: ఆస్ట్రేలియాలోని ఫ్రీమాంటిల్ సందర్శనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం తిరిగొచ్చిన ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందిని తూర్పు నావికా దళ సబ్‌మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందించారు. రాయల్ ఆస్ట్రేలియా నేవీతో ద్వైపాక్షిక వ్యాయామాల్లో వాగిర్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కెప్టెన్ ద్వారా రెండు దేశాల ద్వైపాక్షిక వ్యాయామాలకు సంబంధించిన మరిన్ని విషయాలను రాజేష్ పెంధార్కర్ అడిగి తెలుసుకున్నారు.